# నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశా


సంజీవయ్యనగర్‌లో చేపట్టనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, డిసెంబర్ 30 : నల్లకుంట డివిజన్ సంజీవయ్యనగర్‌లో రూ.11 లక్షలతో ఏర్పాటు చేయనున్న నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను డివిజన్ కార్పొరేటర్ వై.అమృతతో కలిసి శనివారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రారంభించారు. అనంతరం పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదు సంవత్సరాల కాలంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని అన్నారు. గతంలో నిధుల మంజూరై మిగిలిపోయిన పనులకు ఇప్పుడు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నామన్నారు. ఇంకా చాలా చోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయని, అధికారులు వెంటనే ఆ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ రోహిత్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు

ముషీరాబాద్, డిసెంబర్ 30: అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. శనివారం ఆయన అడిక్‌మెట్, రాంనగర్ డివిజన్‌లోని పోచమ్మ దేవాలయం, అడిక్‌మెట్ కమ్యూనిటీహాల్‌లో కొనసాగుతున్న ప్రజా పాలన సెంటర్లను సందర్శించి ప్రజల నుంచి సంక్షేమ పథకాల దరఖాస్తుల స్వీకరణ తీరును వాకబు చేశారు. ప్రజాపాలన సెంటర్‌ల అధికారులు, ప్రజలను నేరుగా కలుసుకున్న ఆయన దరఖాస్తుల స్వీకరణ తీరు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తులను అధికారులు పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తారని, ఎవరూ సంక్షేమ పథకాల విషయంలో ఆందోళన చెందవద్దని సూచించారు. బస్తీల వారీగా లబ్ధిదారుల నుంచి అన్ని సంక్షేమ పథకాలకు సంబంధించిన దరఖాసులను స్వీకరించిన తరువాత విచారణ చేస్తారని తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కువ మంది లబ్ధిదారులకు పెన్షన్లు, ఇతర పథకాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ముఠా జయసింహ, బి. శ్రీనివాస్‌రెడ్డి, ముదిగొండ మురళి, ఇంద్రసేనారెడ్డి, రమేశ్‌యాదవ్, ఎర్రం శేఖర్, ముచ్చకుర్తి ప్రభాకర్, మాధవ్, అబ్బు, శ్రీహరి, రాజు తదితరులు పాల్గొన్నారు.


అడిక్‌మెట్ ప్రజాపాలన సెంటర్‌లో పరిస్థితిని సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

## వంట మనిషి అదృశ్యం


ఎలిజబేత్

కవాడిగూడ, డిసెంబర్ 30: వంట చేసే మహిళ చెప్పకుండా వెళ్లిపోయిన ఘటన గాంధీనగర్ పరిధిలో శనివారం చోటుచేసుకున్నది. ఏఎస్ఐ ఎల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నయ్‌కి చెందిన ఎలిజబేత్ (50) బోయిగూడలోని డాన్‌బోస్కో నవజీవన్ ఆఫర్ కేర్‌సెంటర్‌లో ఈ నెల 24న వంట మనిషిగా చేరింది. ఆదే సెంటర్‌లో పనిచేస్తున్న అడాల్స్ అనే వ్యక్తి ఎలిజబేత్‌కు ఒక రూం కేటాయించారని, ఈ నెల 27న సాయంత్రం 5 గంటలకు హోంలో చెప్పకుండా వెళ్లిపోయిందని అడాల్స్ ఫిర్యాదు చేశారు. ఎత్తు 5.2, తెలుగు మాట్లాడుతుందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఎల్లయ్య తెలిపారు.

## ఫోన్ రిఫేర్ కోసమని చెప్పి..


బి. సంజీవ

కవాడిగూడ, డిసెంబర్ 30: ఫోన్ రిఫేర్ కోసమని చెప్పి శనివారం ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దోమలగూడ ఎస్ఐ సాయికృష్ణ వివరాల ప్రకారం.. దోమలగూడ ఎంసీహెచ్ క్వార్టర్స్‌కు చెందిన బి. సంజీవ ఫోన్ రిపేర్ చేయించుకుంటానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సంజీవ తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంజీవ 5.5 ఎత్తు, లైట్ పింక్ కలర్ షర్ట్, బ్లూ జీన్స్ ధరించి ఉన్నాడని ఆచూకీ తెలిసిన వారు 9502110738, 7995266324లలో తెలియజేయాలని కోరారు.

## గాంధీనగర్ పరిధిలో మరో వ్యక్తి..


వేణుగోపాల్

కవాడిగూడ, డిసెంబర్ 30 : ఓ వ్యక్తి ఇంట్లో చెప్పకుండా వెళ్లి అదృశ్యమైన ఘటన గాంధీనగర్ పరిధిలో శనివారం చోటుచేసుకున్నది. గాంధీనగర్ ఏఎస్ఐ ఎల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ బోయిగూడకు చెందిన ఎం. వేణుగోపాల్ సెంట్రల్ వ్యూ అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిస కావడంతో పనిలో నుంచి తొలగించారు. ఈ నెల 23న ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడని భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎత్తు 5 ఫీట్లు, తెలుగు, హిందీ మా ట్లాడుతాడని, బ్లాక్ కలర్ ఫ్యాంట్, గ్రే కలర్ జీన్స్ ధరించి ఉన్నాడని ఏఎస్ఐ ఎల్లయ్య తెలిపారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ

అంబర్‌పేట, డిసెంబర్ 30 : సహారా స్వచ్ఛంద సంస్థ 37వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ బాలముకుంద్ ఆధ్వర్యంలో విద్యార్థినులు, వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

అంబర్‌పేట, డిసెంబర్ 30: పటేల్‌నగర్‌కు చెందిన ఆసిమాబేగంకు థైరాయిడ్ ఆపరేషన్ జరిగింది. దవాఖాన ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి కొరకు ఎమ్మెల్యే టి. హరీశ్‌రావు ద్వారా దరఖాస్తు చేయడం జరిగింది. వారికి రూ.60వేలు మంజూరు కాగా ఆట్టి చెక్కును బీఆర్‌ఎస్ సీనియర్ నా యకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ శనివారం వారికి అందజేశారు.

## 'శాంతి స్వప్నాలు' కార్యక్రమం

చిక్కడపల్లి, డిసెంబర్ 30: కాలం గుండె చప్పుడు, సాంస్కృతిక సమష్టి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యుద్ధం, కులం, జెండర్ హింస బాధితులకు అండగా ఉండాలని 'శాంతి స్వప్నాలు' పేర సంఘీభావ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగూరా దర్శకుడు బి.నర్సింగరావు, ఆంధ్ర జ్యోతి సంపాదకుడు కె.శ్రీనివాస్, కార్మిక నాయకుడు బి.ప్రదీప్ హాజరయ్యారు.

## భవానీదేవికి.. సాహితీ పురస్కారం

ముషీరాబాద్, డిసెంబర్ 30: వంశీ కల్చరల్, ఎడ్యుకేషనల్ ట్రస్ట్, లేఖిని రచయిత్రుల వేదికల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో రచయిత్రి డాక్టర్ సి.భవానీదేవికి వాసిరెడ్డి సీతాదేవీ-వంశీ జాతీయ సాహితీ పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ ఎన్. గోపి ముఖ్య అతిథిగా పాల్గొని భవానీదేవికి సాహితీ పురస్కారాన్ని అందజేశారు. సాహితీవేత్త వోలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, అత్తలూరి విజయలక్ష్మి, వాసిరెడ్డి నారాయణరావు, భానుమతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ముషీరాబాద్, డిసెంబర్ 30: తెలంగాణ ఉద్యమకారులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ముషీరాబాద్ జేఏసీ తీర్మానం చేసింది. శనివారం రాంనగర్ ఈ సేవా వద్ద ముషీరాబాద్ ఉద్యమకారుల జేఏసీ నేతల సమావేశం జరిగింది. జేఏసీ చైర్మన్ ఎం.నర్సయ్య, కన్వీనర్ టి.రవీందర్, కిరణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలువురు ఉద్యమకారులు పాల్గొని సమస్యలపై చర్చించారు. 2వ తేదీన జరిగే సమావేశంలో ఉద్యమకారులు పాల్గొని ఉమ్మడి దరఖాస్తులు చేయనున్నట్లు తెలిపారు. మురళి తదితరులు పాల్గొన్నారు.

## వరుస చోరీలు.. దొంగ అరెస్ట్

కవాడిగూడ, డిసెంబర్ 30: వరుసగా బైక్ చోరీలకు పాల్పడుతున్న దొంగను సెంట్రల్ జోన్ డీసీపీ శరత్‌చంద్రపవార్, ఏసీపీ రవికుమార్‌ల ఆదేశాల మేరకు దోమలగూడ పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ డి. శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దోమలగూడలోని గౌడహాస్టల్ దగ్గర భిక్షాటన చేసుకునే దాసరి శ్యామ్ అలియాస్ నర్సింగ్ (45) ఇటీవల దోమలగూడలోని వైన్స్ వెనుక గోడకు రంధ్రం చేసి కౌంటర్‌లోని నగదుతో పాటు, షాపు యజమాని బైక్‌ను తొంగిలించి పరారైనట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు డీఐ ఎం. వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీగిరి శ్రీకాంత్ గౌడ్ రంగంలోకి దిగి, నిందితుడిని అరెస్ట్ చేసి విచారించగా దోమలగూడ పరిధిలో 6 బైక్‌లు, ఒక యాక్టీవాను చోరీచేసినట్లు అంగీకరించాడని అన్నారు. వీటి విలువ రూ. 3,18,700 ఉంటుందని తెలిపారు. నర్సింగ్ ఆరేండ్ల నుంచి చోరీలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు నర్సింగ్‌ను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

## ప్రజాపాలన కేంద్రం పరిశీలన..


ప్రజాపాలన కార్యక్రమం తీరును పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్

చిక్కడపల్లి, డిసెంబర్ 30 : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం తీరును తెలుసుకునేందుకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోజ్ శనివారం చిక్కడపల్లిలోని గాంధీనగర్ డివిజన్ వార్డు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించారు. అదే విధంగా దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జీహెచ్‌ఎంసీ జాయింట్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ డక్టార్ తిప్పర్తి యాదయ్య, ఏఎంసీ ప్రవీణ్ చంద్ర, ఏఎంఓహెచ్ డాక్టర్ మైత్రేయ,అధికారులు అశోక్‌రెడ్డి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్రా యాత్రికులకు సన్మానం



ఉమ్రాయాత్రకు వేళ్లే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని విధాలా సహకరించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. భోలక్‌పూర్‌కు చెందిన రఫీఖ్ ఉద్దీన్, మహ్మద్ జాకీర్ హుస్సేన్ తదితరులు శనివారం సౌదీ లోని ఉమ్రాకు వెళ్తున్నారు. వారిని బీఆర్‌ఎస్ మైనారిటీ కమిటీ నాయకుడు జునేద్ బాగ్దాది ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సత్కరించారు. - కవాడిగూడ, డిసెంబర్ 30

## అకడమిక్ హైట్స్..స్కూల్‌సైన్స్ ఫెయిర్



అంబర్‌పేట డీడీకాలనీలో గల అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. విద్యార్థులు వివిధ కళారూపాలను ప్రదర్శించి ప్రతిభ చాటారు. ఈ ప్రదర్శనను సంస్థ రీజనల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్ రూపారెడ్డి ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయురాలు సులక్ష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - అంబర్‌పేట, డిసెంబర్ 30

## శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామికి పూజలు



బాకారంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో శనివారం మైలపోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నల్లవెల్లి దంపతులు పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ ఈఓ రఘు, నాయకులు సురేశ్‌కుమార్, రాజు, సూర్యప్రకాశ్ ముదిరాజ్, రామానందరెడ్డి, రామకృష్ణ, సురేందర్‌రెడ్డి, రఘు పాల్గొన్నారు. - కవాడిగూడ, డిసెంబర్ 30

## రైలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి

కాచిగూడ,డిసెంబర్ 30: పట్టాలు పక్కన మాట్లాడుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన ఘటన కాచిగూడ రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. భవానీనగర్, తలాబ్‌కట్ట ప్రాంతానికి చెందిన షేక్ అనిఫ్‌పటేల్(26),అదే ప్రాంతానికి చెందిన సయ్యద్ ఇమ్రాన్(42)శుక్రవారం రాత్రి ఉప్పుగూడ-యాకత్‌పుర రైల్వేస్టేషన్‌ల మధ్య పట్టాలు పక్కన మాట్లాడుకుంటూ వెళ్తుండగా అదే సమయంలో వచ్చిన రైలు ఢీకొనడంతో ఆ ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.